క్లుప్తంగా

భోగి గణపతి పీఠంలో జపయజ్ఞ పారాయణ



భోగి గణపతి పీఠంలో అనంత పద్మనాభస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: తిరువనంతపురంలో స్వయంభూగా ఆవిర్భవించిన అనంతపద్మనాభ స్వామి ఆలయంలో విష్ణు నిలయానికి ప్రతీకగా నిలిచిన ప్రపంచ ప్రసిద్ధ క్షేత్రమని భోగిగణపతిపీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు అన్నారు. అనంత పద్మనాభస్వామిని ఆరాధించడం వల్ల మానవ జీవితానికి సార్థకత లభిస్తుందన్నారు. శనివారం స్థానిక భోగిగణపతి పీఠంలో శ్రీవారి 68 జపయజ్ఞ పారాయణ నిర్వహించారు. బియ్యం పిండి , బెల్లం, అరటి పండు మిశ్రమంతో చేసిన 7 ప్రమిదల్లో ఆవునెయ్యితో 7 జ్యోతులు వెలింగించి 7 శనివారాలు శ్రీవారి పాదాలు వద్ద సుప్రభాత వేళలో గోవింద సంకీర్తన నిర్వహిస్తున్నామన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కాకినాడ రూరల్: మహానటుడు, తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్ ఆయన విగ్రహానికి పలువురు నేతలు శనివారం నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటరు పిల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఎన్టీఆర్ వర్ధంతిని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

నేడు నుంచి రాష్ట్ర స్థాయి సంగీత వాయిద్య పోటీలు

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో కాకినాడ సూర్యకళా మందిరంలో ఆదివారం ఉదయం 9 గంటలు నుంచి రాష్ట్ర స్థాయి కర్ణాటక సంగీత గాత్ర, వీణా వాయిద్య పోటీలు జరగనున్నట్టు నిర్వాహకులు వక్కలంక రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 సంవత్సరాల లోపు వారిని జూనియర్లు గాను, 17 సంవత్సరాలు నుంచి 26 సంవత్సరాలు మధ్య వారిని సీనియర్లు గాను పరిగణిస్తామన్నారు. పోటీల్లో ఆది తాళ వర్ణం రెండో కాలంలో పాడాలన్నారు. మూర్తిత్రయం కృతుల్లో కనీసం ఇద్దరి కృతులు, పట్నం సుబ్రహ్మణ్యం అయ్యర్, కృతి అందజేసి న్యాయనిర్ణీతలు కోరిన కృతి పాడాలన్నారు. సంగీత పరికరాలు వాయించాలన్నారు. దాతల సహకారంతో పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.


పారిశుధ్య పనుల తనిఖీ



పారిశుధ్య పనులు తనిఖీ చేస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: పారిశుధ్య నిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య పనుల తనిఖీల్లో భాగంగా శనివారం తెల్లవారు జామున ఉదయం కాకినాడ నగరంలోని తొమ్మిదో సర్కిల్, పెద్ద మార్కెట్ ప్రాంతంలో కమిషనర్ భావన పర్యటించారు. చెత్త సేకరణ, వాహనాల్లో తరలింపు వంటి విషయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్ వైజర్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్‌జైలులో వంటగది పరిశీలిస్తున్న మెజిస్టేట్ నిరూప బాంబ్‌డియో

కాకినాడ లీగల్: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అనవసర గొడవలకు వెళ్లడం వల్ల సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని కాకినాడ నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ నిరూప బాంబ్‌డియో తెలిపారు. శనివారం స్థానిక స్పెషల్ సబ్‌జైలులో పరిశీలించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ నిరూప బాంబ్‌డియో మాట్లాడుతూ ఎవరికైనా న్యాయవాదులను పెట్టుకునే స్తోమత లేకపోయినా తమ మండల న్యాయసేవాధికార సంస్థకు దరఖస్తూ చేసుకోవచ్చన్నారు. నిందితుల సమస్యలు, వసతులు, భోజనం తదితర వాటిని అడిగి తెలిసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు పాల్గొన్నారు.

ప్యాకేజీతో స్టీల్ ప్లాంట్‌కు పూర్వ వైభవం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ ఆర్థిక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని, దీంతో స్టీల్ ప్లాంట్‌కు పూర్వవైభవం వస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిందన్నారు.

చార్జీలు ఓకే.. సేవలేవీ!

- నగరంలో పనిచేయని ఏటీఎంలు
- సీడీఎంల పరిస్థితి మరింత అధ్వానం
- సంక్రాంతి సెలవుల్లో ఇబ్బందిపడిన ఖాతాదారులు



రాజేశ్వరినగర్‌లో పనిచేయని సీడీఎం



భానుగుడి సెంటర్‌లో పని చేయని ఏటీఎం

బోట్‌క్లబ్: అత్యవసర పరిస్థితుల్లో నగదు కోసం ఏటీఎంలకు పరుగులు తీసిన వినియోగదారులకు నిరాశే ఎదురవుతోంది. ఏటీఎంల వద్ద నో క్యాష్ బోర్డు ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. సరేలే అని పక్కన ఉన్న మరో బ్యాంకు ఏటీఎం దగ్గరకు వెళ్లినా అది కూడా మూసి ఉంటోంది. దీంతో ఖాతాదారులకు అవస్థలు తప్పడం లేదు. కాకినాడ నగరంలో ఒక్క ఎస్‌బీఐ బ్యాంకుకు సంబంధించి 23 శాఖలు ఉన్నాయి. ఒక్కో శాఖలో 70 వేల నుంచి లక్ష వరకూ ఖాతాదారులు ఉన్నారు. ఈ ఖాతాదారులు నుంచి ఏటీఎం వినియోగించినందుకుగాను చార్జీలు కింద ప్రతి ఆరు నెలలకు ఒకసారి రూ.180 వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్క ఎస్‌బీఐ వినియోగదారులు నుంచి కాకినాడ నగరంలో ఆరు నెలలకు గాను రూ. 37.26 కోట్లు వసూలు చేస్తున్నారు. కానీ ఎస్‌బీఐ ఏటీఎంలు మాత్రం ఎక్కడా సక్రమంగా పనిచేయడంలేదు. కానీ ఖాతాదారుని వద్ద నుంచి చార్జీలు మాత్రం లాగేసుకుంటున్నారు. ఈ చార్జీలకు తగ్గ సేవలు మాత్రం అందించడం లేదు. ప్రస్తుత సంక్రాంతిలో వివిధ ప్రాంతాలు నుంచి ప్రజలు వచ్చారు. చేతిలో డబ్బులు లేకపోవడంతో ఏటీఎంకు పరుగులు పెట్టారు. కానీ నగరంలో పలు ఏటీఎంలో డబ్బులు లేకపోవడంతో దూర ప్రాంతాల్లో ఉన్న ఏటీఎంలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

సీడీఎంల పరిస్థితి మరింత అధ్వానం

సీడీఎం (క్యాష్ డిపాజిట్ మెషిన్)లు కూడా సక్రమంగా పనిచేయకపోవడంతో వినియోగదారులు పడరానిపాట్లు పడుతున్నారు. అత్యవసరంగా ఖాతాల్లో డబ్బులు వేసుకొనేవారు కొందరైతే, వేరే వాళ్లకు డబ్బులు పంపేవారు మరికొందరు ఇలా ఈ బ్యాంకు సేవలు పొందుతున్నారు. అయితే ఎక్కడా సీడీఎంలు పనిచేయకపోవడంత ఇబ్బంది పడ్డారు. స్టేట్‌బ్యాంకు, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకుతో పాటు పలు బ్యాంకులు ఆయా బ్రాంచిల వద్ద సీడీఎంలు ఏర్పాటు చేశాయి. ఈ సీడీఎంల వద్ద కూడా మెషీన్ మరమ్మతులకు గురికావడం, నెట్‌వర్క్ సక్రమంగాల లేకపోవడంతో మధ్యలోనే ఆగిపోతుంది. దీంతో ఖాతాలో డబ్బులు పడకపోవడంతో అత్యవసరంగా దూరప్రాంతంలో డబ్బులు కావాల్సిన వారు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సార్లు డబ్బులు సీడీఎం మెషీన్ తీసుకున్నా జమ కాకపోవడంతో మళ్లీ బ్యాంకుకు వెళ్లి దరఖాస్తు పెట్టుకోవాల్సి వస్తోంది. ఇది వినియోగదారులకు మరింత తలనొప్పిగా తయారైంది.

ఏటీఎంల్లో డబ్బులు నింపే పని ప్రవేట్ ఏజెన్సీది

ఏటీఎంలో డబ్బులు నింపే పనిని ఆయా శాఖలు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించి బ్యాంకులు చేతులు దులుపుకొంటున్నాయి. డబ్బులు అయిపోయిన వెంటనే ఆయా ఏటీఎంలో డబ్బులు నింపకపోవడంతో తరచూ ఏటీఎం వినియోగదారులు బాధలు వర్ణణాతీతం. సొంతంగా బ్యాంకు డబ్బులు నింపే ఏటీఎంలో కాస్త మెరుగుగానే సేవలు అందుతున్నాయి. అక్కడ ఖాతాదారులు ఫిర్యాదు చేస్తే వెంటనే సిబ్బంది సమస్యను పరిష్కరిస్తున్నారు. కొన్ని చొట్ల ఏడీఎం నుంచి డబ్బులు సక్రమంగా రాకపోతే అవి రికవరీ అయ్యే సరికి మూడు నాలుగు రోజులు పడుతోంది.

ఇబ్బంది పడుతున్నాం



మాది శ్రీకాకుళం కాకినాడలో ఒక ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ కోసం వచ్చాను. పండగ కోసం మా నాన్న రూ.3 వేలు నగదు జమ చేశారు. కానీ కొన్ని షాపుల్లో ఫోన్‌పే, గుగుల్‌పే వంటి ఉండడం లేదు. దీంతో డబ్బులు తీసుకొనేందుకు ఏటీఎంకు వచ్చి చూస్తే అవుట్ ఆఫ్ ఆర్డర్ వచ్చింది. దగ్గరలోని మరో ఏటీఎంకు వెళ్లిన అక్కడ పని చేయడం లేదు. ఆటో ఎక్కి వేరే ప్రాంతంలో ఏటీఎంకు వెళ్లి డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.చాలా ఇబ్బంది పడ్డాను. బ్యాంకు సిబ్బంది స్పందించాలి.

– ఎస్ సౌజన్య, విద్యార్థి

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

హౌసింగ్ పీడీ సత్యనారాయణ



కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్‌పై సమీక్షిస్తున్న పీడీ సత్యనారాయణ

కాకినాడ రూరల్: నియోజకవర్గ పరిధిలో పేదలకు పట్టాలు ఇచ్చిన స్థలాల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సత్యనారాయణ కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కాకినాడ రూరల్, కరప, అర్బన్‌లోని రూరల్ డివిజన్ల ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే వివిధ దశల్లో ఉన్న గృహాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణాలకు నెలాఖరులో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా లబ్దిదారులను చైతన్యం చేయాలని కోరారు. మార్చి నెలాఖరు నాటికి ప్రారంభించిన గృహాలు పూర్తవ్వలని లక్ష్యం సాధించే వారికి ప్రోత్సాహకం ఉంటుందన్నారు. సమావేశంలో హౌసింగ్ స్పెషలాఫీసరు సత్యవతి, ఈఈ వై.శ్రీనివాసరావు, ఏఈ నాగభూషణరావు, కరప ఎంపీడీఓ అనుపమ, ఈఓ పీఆర్ అండ్ ఆర్‌డీ రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న హరీష్

బోట్‌క్లబ్: స్థానిక నారాయణమ్మతోటలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయం వద్ద నాగశ్రీ నృత్య అకాడమి ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. నాట్యాచారిణి నాగశ్రీ పర్యవేక్షణలో చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ చిన్నారులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా తలాటం హరీష్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు నృత్యకళలను అందించేందుకు నాగశ్రీ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నులుకుర్తి సాయి, కమిటి సభ్యులు గుత్తుల అప్పారావు, అల్లం రమణ, దూళిపూడి నర సింహమూర్తి, కొకనాటి శ్రీనివాస్, మీరా, అడబాల రాంబాబు, మహిళలు చిన్నారులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌తో పరిశుభ్రం

కాకినాడ క్రైం: కాకినాడలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం స్ఫూర్తిదాయకంగా జరిగింది. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, రాష్ట డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌విఎల్ నరసింహం, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ఎంసీ ఆవరణను శుభ్రపరిచారు. క్యాంపస్‌లో మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, హెచ్‌ఓడీలు డాక్టర్ పాండురంగ విఠల్, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ ఉమ, డాక్టర్ సూర్యకుమారి, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ మునిరత్నమ్మ, జూడా సెక్రటరీ మనోహర్, ఇంటెర్న్ సీఆర్ తరుణ్, ఎన్ఎస్ఎస్ డాక్టర్ సౌమ్య, వార్డెన్ డాక్టర్ లలితతో పాటు వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ(డీఎంహెచ్) కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యాలయ ఆవరణను శుభ్రపరిచి పరిశుభ్రత ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌టీవో డాక్టర్ రమేష్, డిఐవో డాక్టర్ కెవి.సుబ్బరాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న తదితరులు పాల్గొన్నారు. కాకినాడ జీజీహెచ్‌లోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పారిశుధ్య కార్మికులతో కలిసి ఆసుపత్రి అధికారులు ఆవరణను శుభ్రం చేశారు.



ఆర్ఎంసీ ఆవరణను శుభ్రం చేస్తున్న డాక్టర్ నరసింహం, డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ విఠల్, డాక్టర్ శశి



'స్వచ్ఛాంధ్ర'స్వచ్ఛ దివస్‌లో జేఎన్‌టీయుకే డైరెక్టరుల, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

అమరావతి పార్కులో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

కాకినాడ సిటీ: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం సిద్ధార్ధనగర్‌లోని అమరావతి పార్కులో నగరపాలక సంస్థ కమిషనర్ భావన, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు వైడీ రామారావు పాల్గొని పార్కులో చెత్తను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. స్థానిక ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పార్కు అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమరావతి పార్కులో చెత్తను తొలగిస్తున్న కమిషనర్ భావన

జేఎన్‌టీయుకేలో 'స్వచ్ఛాంధ్ర'స్వచ్ఛ దివస్'

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'స్వచ్ఛ ఆంధ్ర'స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని జేఎన్‌టీయూకే ప్రాంగణంలో శనివారం యూసీఈకే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్‌మోహన్‌రావు ఆదేశాలతో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో మెకానికల్ ఇంజినీరింగ్, సీఎస్ఈ, ఈసీఈ, గ్రంథాలయ విభాగాలలో నిర్వహించారు. నెల నెలా ఒక ఇతివృత్తంతో సంవత్సరం పొడవునా 12 ఇతివృత్తాలతో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడతామని ప్రిన్సిపాల్ మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటం విజయవంతం

కాకినాడ సిటీ: ఏలేశ్వరం మండలం, చిన్నింపేట గ్రామంలోని ఇంటర్ స్నాక్స్ కాష్యు ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను తెరిపించాలని 63 రోజుల పోరాటం విజయవంతమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు శనివారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు. చిన్నంపేట గ్రామంలో ఇంటర్ స్నాక్స్ క్యాష్యు ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను శాశ్వతంగా మూసివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించడంతో అందులో పని చేస్తున్న 409 మంది కార్మికులు ఆందోళనకు దిగారు. సీఐటీయూ అండతో పరిశ్రమను తెరిపించాలని, లేని పక్షంలో కార్మికులకు మెరుగైన ఫైనల్ సెటిల్మెంట్ అందించాలని కోరుతూ 63 రోజుల పోరాటం చేశారు. ఈ పోరాటం విజయవంతమైందని ఈశ్వరరావు తెలిపారు. కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్, వేతనాలు, నోటీస్ పీరియడ్ మూడు నెలలకు పూర్తి వేతనం, బోనస్ చెల్లించేలా పరిశ్రమను తిరిగి ప్రారంభిస్తే రిట్రెంచ్‌మెంట్ చేసిన కార్మికులకే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చేలా రాతపూర్వక ఒప్పందం చేసినట్టు ప్రకటించారన్నారు. ఈ పోరాటం విజయవంతానికి సహకరించిన కలెక్టర్ షణ్మోహన్, జేసీఎల్ రాణి, డీసిఎల్ పి.శ్రీనివాస్, సీఐటీయూ అనుబంధ ప్రజాసంఘాల నాయకులకు, న్యాయవాదులకు, ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

బోధించడంలోనే అధ్యాపకులకు సంతృప్తి



ఓపెన్‌హౌస్ ప్రారంభించి, మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఉపకులపతి మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడసిటీ): ఆధునీకరించిన ఓపెన్ స్కూల్‌లో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారని, అధ్యాపకులు ఏడాదిలో నాలుగైదు తరగతులు తీసుకుంటే బోధనలో ఉన్న సంతృప్తి వర్ణించలేనిదని ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ చెప్పారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో శనివారం ఉదయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ (ఐఎస్‌టీ) ఎదురుగా ఆధునీకరించిన (రెనోవేషన్) 'జంగిల్ బుక్' ఓపెన్ స్కూల్‌ను వీసీ మురళీకృష్ణ ప్రారంభించారు. యూసీఈకే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎన్‌మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వీసీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాగా అతిథులుగా రెక్టార్ కె.వి.రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ఓపెన్ స్కూల్‌లో విద్యార్థులు కూడా పాఠ్యాంశాలపై స్వేచ్ఛగా చర్చలు జరుపుకోవచ్చన్నారు. ఓపెన్ స్కూల్ నవీకరణకు కృషి చేసిన చీఫ్ ఇంజినీర్ వి.శ్రీనివాసులు, డీఈఈ సన్నీ ఫ్రాన్సిస్, ఏఈఈ బి.నవీన్, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు జి.ఏసురత్నం, ఏఎం.ప్రసాద్, ఎ.స్వర్ణకుమారి, ఏఎస్ఏ చక్రవర్తి, యూసీఈకే వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.స్వరూపారాణి, జీవీఎస్ఆర్ దీక్షితులు, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాదరాజు, కె.పద్మరాజు, విభాగాధిపతులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కాకినాడలో భాగస్వాములు కావాలి



స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో నగర ప్రజలందరూ భాగస్వాములు కావాలని, మన కాకినాడను పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించాలనే ఆదేశాల మేరకు శనివారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ భావన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నెలకు ఒక అంశాన్ని ఎంచుకుని ఈ స్వచ్ఛ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్ అనే ప్రత్యేక అంశంతో ఈ జనవరి నెల స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ భావన తెలిపారు. ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టి ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా నగరపాలక అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది, సచివాలయం, పారిశుధ్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీగా కొండయ్యపాలెం ఫ్లైవర్ సెంటర్ సమీపానికి వెళ్లి అక్కడ మానవహారం నిర్వహించారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట రహదారిని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఈ కామేశ్వరరావు, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ, మేనేజర్ సత్యనారాయణ, ఆర్వో శిరీష తదితరులు పాల్గొన్నారు. నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలోనూ ఉదయం ఏడు గంటలకు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాల ద్వారా వీధులను, డ్రైన్లు, టాయిలెట్లను శుభ్రపరచడం కార్యక్రమాలు నిర్వహించారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి ఎఫ్‌డీపీ

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): జేఎన్‌టీయుకే ప్రాంగణంలో సోమవారం నుంచి 25వ తేదీ వరకు 'ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ ఆప్టిమైజింగ్ రెన్యూవబుల్ ఎనర్జీ సిస్టమ్స్ విత్ స్మార్ట్ మెటీరియల్స్ అండ్ స్టోరేజ్ సొల్యూషన్స్' అనే అంశంపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ(ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) నిర్వహించనున్నారు. ఈ మేరకు మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్, ఎఫ్‌డీపీ కో–ఆర్డినేటర్ వి.వి.సుబ్బారావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, కో–ఆర్డినేటర్ డా.కె.దిలీప్‌కుమార్ శనివారం తెలిపారు. జేఎన్‌టీయుకే ప్రాంగణంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ (యూసీఈకే) మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ ట్రెనింగ్, లెర్నింగ్ (అటల్) అకాడమీ సహకారంతో ఈ ఎఫ్‌డీపీ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎఫ్‌డీపీ ద్వారా అధ్యాపకులు, పరిశోధకులు, సబ్జెక్ట్ నిపుణులకు వేగంగా అభివృద్ధి చెందుతున్న పునరుత్పాదక ఇంధన సాంకేతికతలకు సంబంధించిన అధునాతన సాంకేతిక అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. సమృద్ధిగా లభించే సౌరశక్తి, విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయడానికి ఫోటోవోల్టాయిక్ సూత్రాన్ని ఉపయోగించి వినియోగించబడుతుందని, అత్యాధునిక సాంకేతికతలు, స్మార్ట్ మెటీరియల్స్‌పై దృష్టి సారించడంతో పాటు సైద్ధాంతిక భావనలు, ప్రాక్టికల్ ఇంప్లిమెంటేషన్, గరిష్ట సామర్థ్యం, స్థిరత్వం కోసం పునరుత్పాదక ఇంధన వ్యవస్థలను ఆప్టిమైజ్ చేసేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుందన్నారు. ఎఫ్‌డీపీలో భాగంగా ఇంటరాక్టివ్ లెక్చర్‌లు, ప్రాక్టికల్ సెషన్‌లు, కేస్ స్టడీస్‌ల ద్వారా పునరుత్పాదక ఇంధన సాంకేతికతలలో తాజా పరిణామాలపై అవగాహన పెంపొందుతుందని ఎఫ్‌డీపీ కో–ఆర్డినేటర్ వి.వి.సుబ్బారావు, కో–ఆర్డినేటర్ డా.కె.దిలీప్‌కుమార్ వివరించారు.

ఖైదీలపై వివక్ష చూపరాదు



సబ్‌జైలును పరిశీలిస్తున్న కమలాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు

కాకినాడ లీగల్: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మోడల్ ప్రిజన్స్ మాన్యువల్ 2016లోని 29వ అధ్యాయం ప్రకారం.. జైలు అధికారులకు జారీ చేసిన అన్ని నియమాలు, నిబంధనల ఆదేశాల ప్రకారం కుల, మత, లింగ వివక్షత లేకుండా ఖైదీలను చూడాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవితో పాటు బోర్డు ఆఫ్ విజిటర్లతో కాకినాడ స్పెషల్ సబ్ జైలు సందర్శించారు. సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడారు, వసతులను, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు, అధికారులు పాల్గొన్నారు.